ఇంటికో ఉద్యోగం.. రెండోసారి మోసం

- కూటమి ప్రభుత్వంలో పెరుగుతున్న నిరుద్యోగం
- నిరుద్యోగ భృతి మాట నీటి మూటే!
- వలంటీర్ల తొలగింపు
- ఆప్కాస్ రద్దు
- ఉద్యోగ భద్రత కరువు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నిరుద్యోగులను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోవచ్చని, వారిని ఎన్నిసార్లెనా మోసగించవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తించినట్టుగా కనిపిస్తోంది. 2014వ సంవత్సరం ఎన్నికల సమయంలో ప్రతి కుటుంబానికీ ఒక ఉద్యోగం ఇస్తానని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీని తుంగలో తొక్కారు. మళ్లీ అదేబాటలో 2024 ఎన్నికల సమయంలో కూడా ప్రతి ఇంటిలో నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఉద్యోగాలు లేకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామని మరోసారి ఓట్లు వేయించుకుని మోసం చేశారని నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

30 వేల మంది నిరుద్యోగులు

ఏలూరు నియోజకవర్గంలో సుమారు 30 వేల మంది నిరుద్యోగులున్నారు. కూటమి ప్రభుత్వం వస్తే చంద బాబు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో మొదటి హామీ నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామనే ఉండడంతో వారి సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. ఎన్నికల్లో నిరుద్యోగులు మొత్తం కూటమికి ఏకపక్షంగా ఓట్లు వేసి గెలిపించారు. గత ఏడాదిగా ఉద్యోగాలు, ఉపాధి గురించి అసెంబ్లీ సమావేశాల్లో కనీసం చర్చించకపోవడం చూస్తుంటే ఈ దఫా కూడా తమకు మొండి చేయి చూపించే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని నిరుద్యోగులు వాపోతున్నారు.



ఉద్యోగాల కోసం ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు (ఫైల్)

ఆశలు ఆవిరి

ఇంటికో ఉద్యోగం ఇవ్వలేకపోతే కనీసం నిరుద్యోగ భృతి అయినా ఇస్తామనడంతో నిరుద్యోగులు భృతి కోసం గంపెడాశలు పెట్టుకున్నారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో కంటి తుడుపు చర్యగా చిన్నచిన్న హామీల్లో కోత పెట్టి అమలు చేసింది తప్ప పూర్తిస్థాయిలో తమ హామీలు అమలు చేయకపోవడంతో వారిలో ప్రభుత్వంపై నమ్మకం సన్నగిల్లింది. ఉద్యోగాలు రాకపోయినా ప్రభుత్వం ఇచ్చే భృతితో గౌరవప్రదంగా జీవిద్దామని ఆశించిన నిరుద్యోగులక బాబు మొండి చేయి చూపడంతో తాము మరోసారి మోస పోయామని తొలి ఏడాదిలోనే గ్రహించారు. ఈ మేరకు ప్రభుత్వం ఒక్క ఏలూరు నియోజకవర్గం లోనే నిరుద్యోగులకు మొత్తం 12 నెలలకు కలిపి ఒక్కొక్క నిరుద్యోగికి రూ.36 వేల చొప్పున రూ.వెయ్యి 80 కోట్లు బకాయి పడింది. నిరుద్యోగ భృతిని ఎప్పుడు అమలు చేసినా ప్రభుత్వం ఏర్పాటు చేసిన నాటి నుంచి లెక్కలు వేసి మొత్తం చెల్లించాల్సిందేనని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.



సూపర్‌సిక్స్ హామీల్లో మొదటి హామీ 20 లక్షల ఉపాధి అవకాశాలని పేర్కొన్న ప్రకటన

తారాస్థాయికి నిరుద్యోగిత

సూపర్ సిక్స్ పథకాల్లో తొలి హామీ అయిన 20 లక్షల ఉపాధి అవకాశాలు లేదా రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి అంశాన్ని పూర్తిగా కూటమి ప్రభుత్వం విస్మరించింది. వైఎస్సార్ సీపీ హయాంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ఒక్క ఏలూరు నియోజకవర్గంలోనే 79 సచివాలయాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. వీటిలో 750 మంది వలంటీర్లను నియమించి అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు పెద్ద వారధిని నిర్మించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్లను తొలగించింది. ఏడాది పాలన సందర్భాన్ని పురస్కరించుకుని ఇంటింటికీ రేషన్ బియ్యం అందించే వాహనాలను రద్దు చేసి మరో 100 మంది పొట్టగొట్టింది. ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించే క్లాప్ ఆటోలను రద్దు చేసి వాటి ద్వారా ఉపాధి పొందుతున్న 120 కుటుంబాల జీవనోపాధిని ప్రశ్నార్థకం చేసింది.

ఉద్యోగావకాశాలు కల్పించాలి



కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు వెంటనే ఉద్యోగావకాశాలు కల్పించాలి. ఉద్యోగాలు కలిప్పించకపోగా ఉన్న ఉద్యోగాలను తొలగించి ప్రభుత్వం దారుణంగా మోసం చేసింది. ఒక్క ఏడాదిలోనే ఇన్ని ఉద్యోగాలను తొలగించి కొన్ని వేల కుటుంబాలను రోడ్డున పడేయడం అత్యంత దారుణం.

– కాకి నాని, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు

నిరుద్యోగ భృతి ఇవ్వాలి



ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడం ఈ ప్రభుత్వానికి ఎలాగూ చేతకాలేదు కాబట్టి కనీసం నిరుద్యోగ భృతి అయినా ఇవ్వాలి. నమ్మి ఓట్లు వేసినందకు నిరుద్యోగులను మోసం చేయడం ప్రభుత్వానికి తగదు.

– ఎస్‌కే ఇమ్రాన్, గ్రాడ్యుయేట్ నిరుద్యోగి

చిరుద్యోగుల శ్రమ దోపిడీ

గత ప్రభుత్వాలు వివిధ ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని తీసుకువచ్చి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలను దూరం చేశాయి. నిరుద్యోగుల అవసరాలను ఆసరా చేసుకుని ప్రభుత్వ ఉద్యోగులు నిర్వహించే విధులకన్నా ఎక్కువ పనులు చేయించుకుంటూ జీతాలు వారికి ఇచ్చేదానిలో 25 శాతం కూడా ఇవ్వలేదు. కాంట్రాక్టు వ్యవస్థ ద్వారా నిరుద్యోగల శ్రమదోపిడీకి తెరతీశాయి. ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసి ఒక మధ్యవర్తిని పెట్టి అతని చేతిలో ఉద్యోగావకాశాలను పెట్టి నిరుద్యోగులను నిలువునా ముంచేశాయి. ఈ దోపిడీని అరికట్టడానికి జగన్ ప్రభుత్వం ఆప్కాస్ విధానాన్ని ప్రవేశపెట్టి కనీస వేతనంతో ఉద్యోగాలివ్వడం ప్రారంభించి నిరుద్యోగుల్లో ఆశలు రేకెత్తించింది. ఆ ఆశలు ఎంతోసేపు లేకుండా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆప్కాస్ వ్యవస్థను రద్దు చేసి చిరుద్యోగులకు ఉద్యోగ భద్రతను దూరం చేసింది.

క్లుప్తంగా

టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు టౌన్: స్థానిక సురేష్ చంద్ర బహుగుణ పోలీస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పోలీస్ శాఖ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. పీఈటీ రెండు పోస్టులకు (పురుష, మహిళ అభ్యర్థులు) ఫిజికల్ సైన్స్–1, హిందీ పండిట్–1, తెలుగు పండిట్–1, కంప్యూటర్ ఫ్యాకల్టీ–1, ఎలిమెంటరీ టీచర్–1 మొత్తం 7 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు పేర్కొంది. అభ్యర్థులు బీఈడీ అర్హతతో నిపుణులైన ఉపాధ్యాయ అభ్యర్థులు ఈనెల 10 తేదీ ఉదయం 9 గంటల నుంచి వాక్‌ఇన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరింది. అటెండర్ పోస్టు భర్తీకి ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ నిర్ణయించారని తెలిపింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని శాంతి నగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఫీడర్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. శాంతి నగర్, గ్జేవియర్ నగర్ ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పంటల మద్దతు ధర కల్పనలో విఫలం

కుక్కునూరు: రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఏఐయూకేఎస్ జాతీయ కమిటీ కన్వీనర్ కెచ్చెల రంగారెడ్డి విమర్శించారు. గురువారం అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం గడ్డల ముత్యాలరావు అధ్యక్షతన కుక్కునూరు ప్రజాపంథా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ 2025–26 పంట కాలానికి ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ 14 రకాల పంటలకు ధరలు నిర్ణయిస్తూ అనేక రాష్ట్రాల సిఫార్సులను పక్కన పెట్టి తన కార్పొరేట్లకు అనుకూలంగా ఎంఎస్‌పీ నిర్ణయించిందని ఆరోపించారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు వరి క్వింటాకు సాధారణ రకం రూ.3 వేలు, ఏ గ్రేడ్ రకానికి రూ.3,200, ప్రత్తికి రూ.8,521, మొక్కజొన్నకు రూ.2,900, వేరుశెనగకు రూ.8 వేలు, కందులకు రూ.9,200, పెసర్లకు రూ.9 వేలు, హైబ్రిడ్ జొన్నలకు రూ.4 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలవరం ముంపు పేరుతో విలీన మండలాల్లో మూసివేసిన వెబ్‌ల్యాండ్‌ను పునరుద్ధరించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఏఐయూకేఎస్ రాష్ట్ర నాయకులు సిరికొండ రామారావు, బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు న్యాయం చేయాలి

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంలోని ఆటోలకు డిజిటల్ ట్రాఫిక్ నెంబర్లు తయారీకి ఏజెన్సీలను టెండర్ విధానంలో నియమించాలని ఏలూరు జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్ష, కార్యదర్శులు చక్రాల అమర్‌కుమార్, జి.గోపి కోరారు. ఈ మేరకు గురువారం ఉదయం ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావుకు వినతిపత్రం అందజేశారు. ఏలూరు నగరంలో సుమారు ఐదు వేల మంది ఆటో కార్మికులు ఉన్నారని, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చుతున్నారని పేర్కొన్నారు. మే 13న ఏలూరు ట్రాఫిక్ పోలీస్ అధికారులు నిర్వహించిన డ్రైవర్ల సమావేశంలో ఆటోకు డిజిటల్ ట్రాఫిక్ నెంబర్లు విధిగా తీసుకోవాలని చెప్పారని గుర్తుచేశారు. ప్రయాణికుల భద్రత, నేరాల నిరోధానికి ఈ విధానం ఉపయోగపడుతుందని, దీనికి సీఐటీయూ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. డిజిటల్ ట్రాఫిక్ నెంబర్లు తయారు చేసే ఏజెన్సీలను నియమించటంలో నామినేటెడ్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నామని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తక్కువ ధరకే డిజిటల్ నెంబర్లను తయారు చేసే ఏజెన్సీలకు ఈ బాధ్యతలను అప్పగించాలని కోరారు. రూ.200కే డిజిటల్ ట్రాఫిక్ నెంబర్లు తయారు చేసే సంస్థలు ఉన్నాయని, రూ.250 చెల్లించటం ద్వారా ఆటో కార్మికులు నష్టపోతారని వివరించారు. ఎస్పీ కేపీ శివకిషోర్ దీనిపై పరిశీలించి చర్యలు చేపట్టాలని కోరారు.



ఏఎస్పీ సూర్యచంద్రరావుకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

‘కోకో రైతులను ఇబ్బందులు పెడితే ఉద్యమిస్తాం’

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కోకో రైతులను ఇబ్బంది పెడితే తిఇరగి ఉద్యమాన్ని ప్రారంభిస్తామని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీ హెచ్చరించింది. స్థానిక అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లు రామకృష్ణ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ కోకో రైతుల వద్ద ఉన్న ప్రతి కోకో గింజ కొనుగోలు చేయించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని, కోకో గింజలు కిలోకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.500కు కొనాలని డిమాండ్ చేశారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఏబీ వెంకటేశ్వరరావు, సంఘం రాష్ట్ర సీనియర్ నాయకుడు వై.కేశవరావు మాట్లాడుతూ కోకో గింజలు కొనుగోలుకు ప్రభుత్వ లక్ష్యం పూర్తయిందని చెప్పడం తగదన్నారు. అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వకపోవడం వలన ఇప్పటికే కోకో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుసంధానిస్తూ ఫార్ములా రూపొందించి కోకో గింజలకు ధర నిర్ణయించే విధానం తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైతుల వద్ద ఉన్న కోకో గింజలు పూర్తిగా కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు సింహాద్రి గోపాలకృష్ణ, ఉపాధ్యక్షుడు బోళ్ల వెంకట సుబ్బారావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి గుది బండి వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నరసింహ రావు, ఈదుప్గంటి శ్రీనివాస్, బి.పెద వీర్రాజు, పర్వతనేని గోపాలరావు, కట్టా భాస్కరరావు మాట్లాడారు.

పర్యావరణ కాలుష్యాన్ని నివారించాలి

ఏలూరు టౌన్ : పర్యావరణ కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, ఇంటి పరిసరాల్లోనూ, సంస్థలు, కార్యాలయాల ప్రాంగణాల్లోనూ మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాలని ఏలూరు సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శశిధర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరు సర్వజన ఆసుపత్రి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్తంగా ఏలూరు జీజీహెచ్ ప్రాంగణంలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఏడాది థీమ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దాం అనే నినాదంతో ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ దినోత్సవాన్ని జరుకుంటున్నామని తెలిపారు. రెడ్‌క్రాస్ వలంటీర్లు, రెడ్‌క్రాస్ నర్సింగ్ విద్యార్థినులు, మానవత సభ్యులు హాస్పిటల్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, కమిటీ సభ్యులు ఎం చంద్రశేఖర్, ఎం అజయ్‌బాబు, డాక్టర్ వరప్రసాద్‌రావు, ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపల్ దీనా కుమారి, ఎస్ శ్రీలక్ష్మి, టి.రామారావు, ఎ.నిర్మల, ఎం పద్మజ, మానవత సభ్యులు పాల్గొన్నారు.



జీజీహెచ్ ప్రాంగణంలో మొక్కను నాటుతునన సూరింటెండెంట్ డాక్టర్ శశిధర్, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రకృతిలో సంభవిస్తున్న విపత్తుల నివారణకు మొక్కలు పెంచాలని కళాజాతా బృందం సభ్యుడు ఎం ప్రశాంత్ కుమార్ అన్నారు. ఏలూరు కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ కార్యాలయం పర్యవేక్షణలో గురువారం ఎండ్ ప్లాస్టిక్ పాల్యూషన్ అనే నినాదంతో ప్రజలకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలాపై జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద, పోణంగి రోడ్డులో కళాజాత ప్రదర్శనలు నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్ల వాడకం వల్ల కలిగే అనర్థాలు, మెషీన్ లైఫ్‌లో మన జీవన విధానాన్ని మెరుగుపరుచుకునే విధంగా అవలంబించాల్సిన అంశాలు, పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం, పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు ఎం తిరుపతి కుమార్, కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది పాల్గొన్నారు.

హరితవనంగా తీర్చిదిద్దుదాం

ఏలూరు నగరాన్ని పచ్చదనంతో హరితవనంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పేర్కొన్నారు. పర్యావరణం – పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం పోణంగి డంపింగ్ యార్డ్ కాంపౌండ్ లోపల రోడ్డుకు పక్కగా ఉన్న ప్రాంతంలో, టిడ్కో ఇళ్ల ప్రాంతంలో రోడ్డు పక్కనే మొక్కలు నాటారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.



కళాజాత నిర్వహిస్తున్న కళాకారులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఏలూరు (మెట్రో): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జెడ్పీ కార్యాలయ ఆవరణలో చైర్‌పర్సన్ జి.పద్మశ్రీ మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఈ సందర్భంగా ఆమె చెప్పారు. జెడ్పీ అధికారులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

చాటపర్రు పీహెచ్‌సీలో ర్యాలీ

దెందులూరు: ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా గురువారం చాటపర్రు పీహెచ్‌సీ సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పర్యావరణాన్ని కాపాడితే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటామని వైద్యాధికారి డాక్టర్ జి.కృష్ణ, డాక్టర్ కె.ప్రదీప్ చంద్ర అన్నారు. అనంతరామ్ వైద్య సిబ్బందితో కలిసి బీఎస్సీ ఆవరణలో మొక్కలు నాటారు కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ రామాంజనేయులు, బీహెచ్‌ఎల్ మోహన్, కిరణ్ కుమార్ సంధ్య తదితరులు ఉన్నారు.

మే, రాఖీ పుష్పాల కనువిందు



మే పుష్పాలు



రాఖీ పుష్పాలు

ఏలూరు టౌన్: ఇంటి పెరట్లో పచ్చని మొక్కలు... రంగురంగుల పుష్పాలతో ఆహ్లాదకరమైన వాతావరణం మనిషికి మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాటికి ఏలూరు శివారు దుగ్గిరాల ప్రాంతంలో ప్రైవేటు ఉపాధ్యాయులు మహ్మద్ అలీఖాన్ ఇంటి పెరట్లో పూసిన అరుదైన పుష్పాలు కనువిందు చేస్తున్నాయి. రెండు కుండీల్లోనూ మే పుష్పాలు రావటం సంతోషం ఉందని, మరో అరుదైన రాఖీ పుష్పాలు కూడా పూసాయని తెలిపారు.

జీలుగుమిల్లిలో భూముల పరిశీలన



జీలుగుమిల్లిలో భూములను పరిశీలిస్తున్న అధికారులు

బుట్టాయగూడెం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురవుతున్న అల్లూరి జిల్లా చింతూరు డివిజన్‌లోని కొండ్రాజుపేట గ్రామ నిర్వాసితులకు కోసం జీలుగుమిల్లిలో పునరావాస గృహనిర్మాణాలు, భూమికి భూమిగా ఇచ్చేందుకు అవసరమైన భూములను గురువారం చింతూరు ఐటీడీఏ పీఓ అపూర్వ భరత్, స్పెషల్ కలెక్టర్ సరళ వందనం, ఎస్‌డీసీ బలరామకృష్ణ, కూనవరం తహసీల్దార్ వెంకటేశ్వర్లు, నిర్వాసితులు పరిశీలించారు. కార్యక్రమంలో జీలుగుమిల్లి తహసీల్దార్ ఉదయ్, వీఆర్‌ఓ తులసి, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	96
వంకాయలు (కాంతులు)	46	బీన్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	40	చామదుంపలు	46
బెండకాయలు	34	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	32	కంద	--
కాకర కాయలు	46	బీట్‌రూట్	36
బీరకాయలు	40	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	--
క్యాబేజీ	22	అల్లం	64
క్యారెట్	42	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	28	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	24	చుక్కకూర	12
గోరుచిక్కుడు	48	గోంగూర	07–10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10–15	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	25
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	34
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	33
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	08
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	21
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	25
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	03
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	15
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	20
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	24
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	22
ఏలూరు – తిరుపతి	16.00	4830	34

పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలి

కలెక్టర్ వెట్రిసెల్వి

బుట్టాయగూడెం: గిరిజన యువత పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక హైస్కూల్లో గురువారం ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత కోసం ఉద్యోగ మేళా నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల సీఎం చంద్రబాబు పోలవరంలో పర్యటించిన సమయంలో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీతో పాటు గిరిజన యువతకు విద్యా, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆదేశించారని చెప్పారు. ఈ మేరకు 12 మంచి పేరున్న కంపెనీలను తీసుకొచ్చి వెయ్యి మందికి ఉద్యోగ అవకాశం కల్పించేలా కృషి చేశామని తెలిపారు. ఉద్యోగం వద్దంటే ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమలు ఏర్పాటుకు యువత ముందుకు రావాలని, అందుకు అవసరమైన సహకారం అందిస్తామని చెప్పారు. ఇప్పటికే సర్వే నిర్వహించామని, సుమారు రెండు వేల మందికి ఉద్యోగాలు, ఉన్నత విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. దరఖాస్తు చేసుకుంటే ఉన్నత విద్యను పోత్సహిస్తామన్నారు. జాబ్ మేళాలు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో నిర్వహిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గంలో రహదారుల పనులుకు సుమారు రూ.57 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. తొలుత అంతర్జాతీయ పర్యావరణం దినోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణంలో కలెక్టర్, ఎమ్మెల్యేలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎంవీ రమణ, ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్, జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ అధికారి ఎన్ జితేంద్ర బాబు, జిల్లా ప్లేస్మెంట్ అధికారి కె.ప్రవీణ్, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే బాలరాజు